



పిఠాపురం పాదగయకు తరలివచ్చిన భక్తజనం



భక్తజన సందోహం.. పలికెను శివోహం..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు ఓం నమశ్శివాయ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ శివాలయాలు కిటకిటలాడాయి. పాదగయ, ద్రాక్షారామ, సామర్లకోటకు భక్తజనం తరలివచ్చారు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కరఘాట్లు పుణ్యస్నానాలు ఆచరించే భక్తులతో పోటెత్తాయి..



ద్రాక్షారామ: ఘంటాంబిక ఆలయం వద్ద పుష్పాలంకరణ



ఐ.పోలవరం: మురమళ్లలో భక్తుల రద్దీ



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ..



భక్తజనంతో కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం పుష్కరాల రేవు



పాదగయలో జంగమదేవర

మండపేట.. ద్వారపూడిలో ఆదియోగి



పిఠాపురం: పాదగయలో



రాజమహేంద్రవరంలో



సామర్లకోట భీమేశ్వర ఆలయం వద్ద..



పిఠాపురం: పాదగయ వద్ద భక్తజనం



ప్రమాదంలో మృతి చెందిన యువకుల ఫ్లెక్సీలతో మిత్రుల నివాళి

తల్లడిల్లిన 'తాడిపూడి'



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

ఇసుక మేటలలే అనుకుని... గోతుల్లోకి జారి ఐదుగురు బలి

రాజమహేంద్రవరం/ తాళ్లపూడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఇసుకమేటలే కదా అని ఎక్కువ నీరున్న చోటకు నడుస్తూ లోతైన గోతుల్లోకి జారిపోయి ఐదుగురు విద్యార్థులు జలసమాధి కావడం తాళ్లపూడి ప్రజలను తీవ్రంగా కలచివేచింది. శివరాత్రి పర్వదినం రోజున పుణ్యస్నానాలకు వెళ్లి తిరిగిరాని లోకాలు ఈ యువకులు వెళ్లిపోవడంతో ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వేసి పెద్ద గోతులు పెట్టడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తుల ప్రధాన ఆరోపణ. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్ (17), తిరుమలశెట్టి పవన్ (19), పడాల దేవదత్తసాయి (18), పడాల రామదుర్గాప్రసాద్ (19), అనిశెట్టి పవన్‌గణేశ్ (17), మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి ఊరికి దగ్గరలో ఉన్న గోదావరిలో ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. ఐదురుగు ముందుగా స్నానానికి వెళ్లగా, మిగతా ఏడుగురు గట్టుమీదే ఉన్నారు. స్నానానికి వెళ్లిన వాళ్లలో ఆకాశ్, దత్తసాయి తొలుత గోదావరిలో ఇసుక మేటలు వేయడంతో ఓ పది అడుగులు ముందుకు వెళ్లి స్నానం చేస్తూ.. కాస్త పక్కన నీళ్లు కొద్దిగా నీలం రంగులో ఉండడం గమనించి అటువెళ్లి గోతిలోకి జారిపోయారు. వారిని రక్షించే ప్రయత్నంలో మరో ముగ్గురు దుర్గాప్రసాద్, తిరుమలశెట్టి పవన్, అనిశెట్టి పవన్ కూడా గోతుల్లోకి జారిపోయారు. ఇందులో తిరుమలశెట్టి అనిల్‌కు ఈతవచ్చు. కానీ ఒకరిని రక్షించబోయి మిగతావారు మునిగిపోయారు. ఇసుక ర్యాంపు కోసం ఒడ్డున పాక వేస్తున్న కూలీలు వీళ్ల కేకలు విని ఊళ్లో వారికి సమాచారం ఇచ్చారు. ప్రతి శివరాత్రి రోజున గ్రామంలో మజ్జిగ పంపిణీ చేస్తుంటారు. బుధవారం కూడా మజ్జిగ సిద్ధం చేస్తున్నారు. మృతుడు తిరుమలశెట్టి పవన్ చిన్నాన్న తిరుమలశెట్టి శ్రీనివాస్ వాళ్లను చూసి మజ్జిగ పంపిణీకి ఇప్పటికే ఆలస్యమైంది, త్వరగా రండి అని చెప్పి ఏర్పాట్లలో ఉండిపోయాడు. గోదావరిలో స్నానం చేసి వచ్చేద్దామని అనుకొని ఈ 12 మంది వెళ్లిపోయారు. ఈలోపు మజ్జిగ పంపిణీ ఏర్పాట్లలో ఉన్న తాను కరివేపాకు కోసం వెళ్లగా 8.10 గంటలకు దుర్వార్త వినాల్సి వచ్చిందంటూ శ్రీనివాస్ విలపించారు. ఇక తాడిపూడిలోని మూడు వీధుల్లోని జనం మధ్య ఏదొక బంధుత్వం ఉంది. బావ కొడుకు, అన్న అల్లుడు, తిరుమలశెట్టి వారింటికి గర్రె వారి అమ్మాయిని కోడలిగా పంపడం.. ఇలా అందరూ బీరకాయపీచు బంధువులే. మృతుల్లోని పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్తసాయి వరుసకు అన్నదమ్ములు. అదే విధంగా మృతుల తల్లిదండ్రులు అందరూ రోజువారీ కూలి పని లేదా చిన్న రైతులుగా ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. తిరుమలశెట్టి పవన్ డిగ్రీ మొదటి ఏడాది, అనిశెట్టి పవన్ గణేశ్ పాలిటెక్నిక్ మూడో ఏడాది, మిగతా ముగ్గురు ఇంటర్ చదువుతున్నారు. పవన్ గణేశ్ తండ్రి నాలుగేళ్ల కిందట మరణించగా తల్లి రామలక్ష్మి తాళ్లపూడిలోని ఓ కళాశాలలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ పవన్‌తోపాటు కూతురు దివ్యనూ చదివిస్తున్నారు. పవన్ మృత్యువాత పడడంతో ఆమెను సముదాయించడం ఎవరి తరం కాలేదు.


నాలుగు గంటల్లో వెలికితీత

సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్ యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. దీంతో చీఫ్ ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణీ సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. పది మంది గజఈతగాళ్లు, ఆరుగురు ఎస్డీఆర్ఎఫ్, ఆరుగురు ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. గాలింపు 8.30 గంటల సమయంలో చేపట్టగా 12.30 గంటలకు చివరి మృతదేహాన్ని వెలికితీశారు. కొవ్వూరు ఫైర్‌మెన్ ఎం.ప్రకాశ్‌బాబు డైవింగ్ సూట్ వేసుకొని నదిలో బాగా లోతుకు వెళ్లారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులతో పనిలేకుండా ఇష్టానుసారం డ్రెడ్జింగ్ చేశారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రమాదం జరిగిన ప్రదేశంలో కూడా నదిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే ఇప్పుడు యువకులు మృత్యువాతపడ్డారు. ఐదో మృతదేహం జాడ 20 అడుగుల లోతులో దొరకడం గమనార్హం. ప్రస్తుతం ఈ గోతులకు పక్కన ఇసుక వెలికి తీస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత ప్రమాదకరమైన గోతులున్నా హెచ్చరికల బోర్డులు లేకపోవడం మరీ దారుణం.

సర్వం సిద్ధం!



పట్టభద్రుల నియోజకవర్గంలో నేడే పోలింగ్

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నింటిపై అవగాహన కలిగిన పట్టభద్రులే ఓటర్లుగా ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం ముందస్తుగా ఓటర్లకు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ముందుచూపు ప్రదర్శించారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తారు.

- బ్యాలెట్ పత్రాలు.. బ్యాలెట్ బాక్సుల వినియోగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్
- గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి
- స్వేచ్ఛగా ఓటేయండి.. ఆర్వో, కలెక్టర్ వెట్రిసెల్వి

(ఏలూరు,కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో 3 లక్షల 14 వేల 984 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 282 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 66 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ఆరంభమై సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. పోలింగ్ శాతాన్ని పర్యవేక్షిం చేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి. వాస్తవానికి ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు 3 లక్షల 14 వేల 984 మంది ఉండగా వీరి నిమిత్తం 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్ కాస్టింగ్ సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి 35 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1080 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద రెండు వేల 714 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. గురువారం పోలింగ్ జరగనుండడంతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి బుధవారం అధికారులతో సమీక్షించారు.

అంతా టెన్షన్.. టెన్షన్

మూడు నెలలుగా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులంతా గురువారం తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండడమే కాకుండా ఈసారి ఓటర్ల సంఖ్య ఇదే మాదిరిగా పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల అనుకూలతను బట్టి 70శాతం వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పట్టభద్రుల ఓటర్లను ఒక చోటుకు రప్పించడం అంత సులువైన పనికాదని, ఈ కారణంగానే పోలింగ్ మందకొడిగా సాగడంతోపాటు శాతం తగ్గుముఖం పట్టగలదని ఇంకొంతమంది అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. టీడీపీ పక్షాన పేరాబత్తుల రాజశేఖరం పోటీలో ఉండడంతో ఆయనకు అనుకూల తలు,బలహీనతలపైనే ఎవరంతట వారుగా అంచనాలు వేశారు. తెలుగు దేశం మాత్రం తమ పార్టీ అభ్యర్థి భారీమెజార్టీతో గెలుపొందుతారని ఇప్పటికే అంచనా వేసింది. ఇంకోవైపు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు సైతం టీడీపీ అభ్యర్థికి గట్టి పోటీని ఇచ్చారు. ప్రచారంలోను ఏ మాత్రం తగ్గకుండా ముందుకే సాగారు. మిగిలిన అభ్యర్థులు నువ్వానేనా అనే తరుణంలో ప్రచారాస్త్రాలు సంధించారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరి వాదనలు విన్న పట్టభద్రుల ఓటర్లు ఏవైపు మొగ్గు చూపుతారనేదే ఇప్పుడు అందరిలోను టెన్షన్.. టెన్షన్.

ఎన్నికల మెటీరియల్ సరిచూసుకోవాలి
కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల మెటీరియల్ అంతా సరిచూసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ తీసుకున్న అధికారులు అంతా సరిచూసుకోవాలన్నారు. డీఆర్‌వో వెంకట్రావు, ఆర్డీవో మల్లిబాబు, ఎలక్షన్ డీటీలు పాల్గొన్నారు.



అమలాపురం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల సరంజామాతో సిద్ధమైన పోలింగ్ సిబ్బంది

మొత్తం అభ్యర్థులు : 35

ఓటర్లు : 3,14,984

బరిలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం, కాట్రు నాగబాబు, షేక్ హుసేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాశ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీర రాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్‌రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్ బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్జుల, జీవీ సుందర్, హాసన్ షరీఫ్.



కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో పోలింగ్ సామగ్రి పంపిణీపై ఆరా తీస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ఓటు వేసేందుకు వెళుతున్నారా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించే వారంతా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఎన్నికల కమిషన్ నిర్దేశించినట్లు తగిన గుర్తింపు కార్డులను అందుబాటులో ఉంచుకుని పోలింగ్ సమయంలో అధికారుల ఎదుట ప్రదర్శించాలి. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, డిపార్టు మెంట్ గుర్తింపుకార్డు, జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకులు, తపాలశాఖలో జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్‌ను ప్రతీ ఓటరు కలిగి ఉండాలి. ముందస్తుగా ఈ తరహా కార్డులు ఉన్నాయో లేదో సరి చూసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి.

మీ ఓటు చెల్లాలంటే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విధానం అందరూ అర్థం, అవగాహన చేసుకోవాలి. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం బ్యాలెట్ పత్రాలను మాత్ర మే పోలింగ్‌లో వినియోగిస్తారు. ఓటర్లకు ఒక బ్యాలెట్ పత్రాన్ని అందిస్తారు. ఈ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయో గించాలి. ప్రాధాన్యత క్రమంలో మీకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి 2, 3, 4 ఈ తరహాలో ఓటు వేయవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే అంకెను(నెంబర్) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే మీ ఓటు చెల్లదు. మరో ముఖ్య విషయమేమిటంటే బ్యాలెట్ పత్రంలో ఇష్టమైన అభ్యర్థికి 1 అంకె వేయకుండా ఆ తదుపరి 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తే అదీ కూడా చెల్లదు. బ్యాలెట్ పేపర్‌లో అంకెలు మాత్రం వేయాలి.

టమాటా రైతులకు అండగా..

నేరుగా కిలో రూ.8కే ప్రభుత్వం కొనుగోలు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ధర లేక నష్టపోతున్న టమాటా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. కొద్దిరోజులుగా టమాటా పండించిన రైతులకు సరైన ధర లభించడం లేదు. కిలో రూ.2-4లకు కొనుగోలు చేయడం లేదు. దీంతో కనీసం కోత కూలి రాక రైతులు నష్టపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఉద్యాన, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల ద్వారా నేరుగా రైతులనుంచి టమాటాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో టమాటా సాగు చేసిన రైతులనుంచి కిలో రూ.8కు కొనుగోలు చేయడాన్ని బుధవారం ప్రారంభించారు. ఇలా కొనుగోలు చేసిన టమాటాలను రైతుబజార్లకు తరలించారు. ఉద్యానవనశాఖాధికారి కె.సత్యశైలజ, సహాయకుడు బి.గోవిందరాజులు,మార్కెటింగ్‌శాఖ ఎస్టేట్ ఆఫీసర్ గోవిందరాజులు, కృష్ణారావు పాల్గొన్నారు.



రైతులనుంచి టమాటాలు కొనుగోలు చేస్తున్న ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు: ఎస్పీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 98 పోలింగ్‌కేంద్రాల్లో 70,540అనగా 42,463మంది పురుషులు, 28,072మంది మహిళలు, ఐదుగురు ఇతరులు వారి ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ విధుల్లో భాగంగా సిబ్బందికి అదనంగా 21 రూట్ మొబైళ్లు, సర్కిల్‌కు ఒకటి చొప్పున 10 స్ట్రయికింగ్ ఫోర్స్, సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున రెండు స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్‌లతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. సీఆర్‌పీసీ 144 సెక్షన్ తోపాటు 30అమలులోఉన్నందున ఐదుగురికంటే ఎక్కువమంది కలిసి ఉండేందుకు వీలు లేదన్నారు.పోలింగ్‌సమయంలో ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే చర్యలుతప్పవన్నారు.

'ప్రమాదం లేని చోట్లే స్నానమాచరించాలి'

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో దేవాలయాలు, నదులు, చెరువుల వద్దకు భారీసంఖ్యలో భక్తులు తరలివెళ్లే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు నిర్ణయించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు చేయాలని, ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేని ప్రమాదకరమైన రేవులు, స్నానఘట్టాల్లో స్నానాలు చేయడం ప్రమాదకరమన్నారు.

హరోంహర



పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం



రాజమహేంద్రవరం గోదావరి తీరంలో భక్తుల పుణ్యస్నానాలు



ద్రాక్షారామలో భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం

పిఠాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పిఠాపురం పట్టణం భక్తజన సంద్రమైంది. పాదగయ క్షేత్రానికి తరలివచ్చే రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు మంగళవారం అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము సమయానికే పాదగయ బయట కిలోమీటరు మేర భక్తులు వున్నారు. స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తిపీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను, ఇతర ఉపాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి కుక్కుటేశ్వర స్వామి భక్తులకు నిజ రూపంలో దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వైద్య శిబిరాల్లో అస్వస్థతకు గురైన పలువురికి వైద్య సేవలు అందించారు. పట్టణంలోని ఉమాసోమేశ్వర స్వామి, సకలేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కోటిపల్లి

కె.గంగవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వేకువజామున గోదావరి నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామివారికి బాలభోగం నివేదించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఛాయాసోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఆలయంలో చాగంటి వంశీయులు నాలుగు తరాలుగా నిర్వహిస్తున్న అఖండ దీపారాధనను కొనసాగించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, ఉత్సవ ప్రత్యేకాధికారి నల్లం చక్రధరరావు, ఆలయ తనిఖీ అధికారి బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో భీమశంకరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను వారు పర్యవేక్షించారు. మాన్సాస్ ట్రస్టు కార్యాలయం వద్ద అన్నదానాన్ని ఉత్సవ ప్రత్యేకాధికారి నల్లం చక్రధరరావు ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం, కాకతీయ సంఘం, శాలివాహన సంఘం, పైండా వారి అన్నసత్రంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు నిర్వహించాయి. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



సోమేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



గోదావరిలో రెండు లక్షల మంది పుణ్యస్నానాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి తీరం శివ నామస్మరణతో మార్మోగింది. బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు గోదావరి రేవులకు చేరుకుని హర హర మహాదేవ శంభో శంకర, నమఃశ్శివాయ అంటూ పుణ్యస్నానాలు చేశారు. కోటిలింగాల రేవు, చింతాలమ్మ ఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాల రేవు. మార్కండేయ ఘాట్, టీటీడీ ఘాట్, దోబీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌లు భక్తులతో కిక్కిరిశాయి. సుమారు రెండు లక్షల మంది స్నానాలు ఆచరించారు. మహిళలు కుటుంబీకులతో కలిసి స్నానాలు చేసి గోదావరమ్మకు పసుపు, కుంకుమ సమర్పించారు. ఉమాకోటిలింగేశ్వరాలయం, ఉమామార్కండేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, ఉమారామలింగేశ్వరాలయం, సర్వేశ్వరాలయం, సారంగధరేశ్వరాలయం, ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం, కల్యాణి సమేత సోమలింగేశ్వరాలయం, బసవ లింగేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పేర్గాంచిన ఉమాకోటిలింగేశ్వర క్షేత్రంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు రథాన్ని లాగుతూ స్వామి, అమ్మవార్లను తిలకిస్తూ భక్తిపారవశ్యం చెందారు.

ద్రాక్షారామ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయం భక్త జనసంద్రమైంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తుల రాక మొదలుకాగా పది గంటలకు తీవ్ర రద్దీ నెలకొంది. వేలాది మంది క్యూలైన్లలో బారులు తీరి భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారినిదర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. శీఘ్ర, విశిష్ట దర్శనాలకే 3-5 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయి. 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ నిర్వహించారు. 12 గంటలకు మహా నివేదన చెల్లించారు. రాత్రి 1.30 గంటల వరకు భక్తులు దర్శించుకున్నారు. చండీ హోమ పండితుడు ఇంద్రగంటి రామారావుశర్మ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. ఉత్సవ అధికారి, దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు పర్యవేక్షణలో, ఈవో అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర ఆలయాల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తెల్లవారుజామున ప్రథమ అభిషేకం, దధీసేవలో పాల్గొన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, టెక్నికల్ ఐజీ శ్రీకాంత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సామర్లకోట

సామర్లకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. మూలవిరాట్‌కు తెల్లవారుజాము నుంచీ ఆలయ పండితుల వేదమంత్రోచ్చారణలతో విశేష అభిషేకాలు జరిపారు. ఎండ ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తులు క్యూలైన్లలో నిలుచుని భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లపై కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, అదనపు ఎస్పీ సమీక్షించారు. కోనేరు, గోదావరి, మాండవ్యనారాయణస్వామి ఆలయ పుష్కరిణిల వద్ద తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కెనాల్ రోడ్డు పొడవునా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో పలుమార్లు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తలాటం సూర్యనారాయణ, ఈవో నీలకంఠం ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. భీమేశ్వరుణ్ణి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఆర్డీవో ఎస్.మల్లిబాబు దంపతులు, తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.



ప్రత్యేక అలంకరణలో కుమారరామ భీమేశ్వరస్వామి



ఆదియోగి విగ్రహం లోపలి భాగంలో ప్రతిష్ఠించిన శివలింగం

ఆదియోగి విగ్రహావిష్కరణ

మండపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆదియోగి తొలి భారీ విగ్రహాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో మహా శివరాత్రి పర్వదినాన అశేష భక్తజనం, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బుధవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభించారు. ఆంధ్ర శబరిమల ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. ఆదియోగి విగ్రహం లోపలి భాగంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అయోధ్య బాలరాముడు, వారాహిమాత విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. ఆదియోగి విగ్రహాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, స్థానిక నాయకులు, పలువురు రాజకీయ ప్రముఖులు, భారీ సంఖ్యలో ప్రజలు దర్శించుకున్నారు.



వారాహి మాత విగ్రహం

తాడిపూడి.. శోకసంద్రం!

- తల్లడిల్లిపోయిన కుటుంబ సభ్యులు
- అందరూ చిన్నరైతుల బిడ్డలే



సంఘటనా స్థలంలో బాధతో రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు



యువకులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన ఐదుగురు మిత్రుల జలసమాధితో గ్రామం యావత్తూ శోకసంద్రంలో మునిగిపోయింది. గోదావరి నదీ తీరంలో కన్న బిడ్డలను పోగొట్టుకున్న కుటుంబాల వారి ఆర్తనాదాలతో, వారి బంధువుల ఓదార్పులతో తల్లడిల్లింది. చనిపోయిన వారి మృతదేహాలను వెతికే సమయంలో జిల్లా కలెక్టరు ప్రశాంతి అక్కడికి విచ్చేసి బాధిత కుటుంబాల వారిని కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి ఆయా కుటుంబాల వారిని ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేలా అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. కాగా మృతుల్లో పడాల సాయి తండ్రి పడాల రాము మాట్లాడుతూ తనకు ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తానని, కొడుకు, కూతురు ఉన్నారని.. ఉన్న ఒక్క కొడుకూ చదివి కుటుంబానికి ఆధారంగా ఉంటాడని అనుకుంటే ఇలా అయిపోయిందని రోదించాడు. మరో మృతుడు పడాల దుర్గాప్రసాద్ తండ్రి పడాల వెంకన్నదొర మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తన ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ప్రసాద్ ఐటీఐ చదువుతున్నాడని, చదువు అనంతరం పెద్ద దిక్కుగా ఉంటాడనుకుంటే ఇలా జరిగిం దని వాపోయాడు. గర్రే ఆకాష్ తండ్రి సీతారాముడు మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తనకు ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ఆకాష్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడని, పెద్ద చదువులు చదివి, తమ కుటుంబాన్ని ఆదుకుంటాడనుకుంటే ఘోరం జరిగిపోయిందని విలపించాడు. అనిశెట్టి పవన్ తాత కామిశెట్టి పోసియ్య మాట్లాడుతూ తను వ్యవసాయ కూలీగా జీవిస్తున్నానని, తన అల్లుడు మరణానంతరం తన కూతురు, మనుమడు తన దగ్గరే ఉంటున్నారని, తన కూతురు తాళ్లపూడిలో ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండగా, ఆమెకు ఉన్న ఒక్క కొడుకూ కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కన్నీరుమున్నీరయ్యాడు. తిరుమలశెట్టి పవన్ తండ్రి చిన రంగయ్య మాట్లాడుతూ ఉన్న కొద్దిపాటి పొలంతో పాటు తాను కౌలుకు వ్యవసాయం చేస్తున్నానని, కొడుకు మంచిగా చదివి పెద్ద ఉద్యోగం చేస్తాడనుకుంటే కడతేరిపోయాడంటూ విలపించాడు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి దుర్గేష్

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాడిపూడిలో గోదావరి స్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మృతదేహాలను సందర్శించారు. బంధువుల నుంచి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.పద్మశ్రీరాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్‌ను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాద సంఘటనను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతోపాటు సీఎంవో దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మృతిచెందిన యువకులు జనసేన సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిసిందని, పార్టీ సభ్యత్వం ఉన్నట్టు యితే రూ.5 లక్షలు ప్రమాదబీమా వస్తుందన్నారు. కాగా శవ పంచనామా పూర్తయ్యేవరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో ఉండిపోయారు. సెలవుదినం అయినప్పటికీ ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులు అందరూ అందుబాటులో ఉండి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి

సహాయం అందేలా చూస్తాం

ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపు వద్ద స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందిన ఘటన బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనపై కలెక్టర్ ప్రశాంతితో ఫోన్‌లో ఆరా తీశారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు సాయం అందేలా చూస్తామన్నారు.

హుషారుగా హాకీ...

12వ రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ బుధవారం 12వ రోజు హుషారుగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 3 మ్యాచ్‌లు జరిగాయి. సెంట్రల్ సెక్రటేరియట్, ఆర్ఎస్బీ కన్పూర్ పురుషుల క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-1 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్, చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ 4-1 తేడాతో విజయం సాధించింది. డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరునికి సువర్ణ నాగాభరణం బహూకరణ



నాగాభరణం సమర్పిస్తున్న నాగేంద్రరావు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి చెయ్యేరుకు చెందిన త్సవటపల్లి నాగేంద్రరావు 313 గ్రాములు బరువు రూ.25లక్షల విలువైన సువర్ణ నాగాభరణం బహూకరించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో నాగేంద్రరావు, అనంతలక్ష్మీసత్యవతీదేవి దంపతులు స్వామికి నాగాభరణం సమర్పించారు. సంప్రోక్షణ అనంతరం ఆలయ అర్చకులు నాగాభరణాన్ని స్వామికి అలంకరించారు. కార్యక్రమంలో ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, నడింపల్లి సూర్యవర్మ, దాట్ల రామకృష్ణంరాజు, దాట్ల ఇంద్రరాజు, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, కటారి నాని, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారం, నగదు చోరీ

రావులపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం అభరణాలు, నగదు అపహరించుకుపోయిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..... లక్ష్మీపోలవరానికి చెందిన దేవగుప్తపు శ్రీనివాసన్ ఈనెల 22న పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం ముప్పర్తిపాడులో జరిగే అమ్మవారి జాతరకు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి 25న రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులోని 30 కాసుల బంగారం ఆభరణాలు, రూ.1.70 లక్షలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో రావులపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎం.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీమ్ పరిశీలించి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు

టీడీపీలోకి మరో వైసీపీ కౌన్సిలర్

తుని రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇప్పటికే 15మంది వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా తాజాగా మరొకరు సైకిల్ ఎక్కేశారు. ఒకటో వార్డు మహిళా కౌన్సిలర్ వారాధి జ్యోతి కుటుంబం సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. ఆమెకు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



యనమల సమక్షంలో టీడీపీలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ జ్యోతి

పాదగయ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మహాశివరాత్రి సందర్భంగా అన్నవరం నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రానికి దర్శనం నిమిత్తం ఆటోలో తొమ్మిది మంది ప్రయాణికులు బయలుదేరారు. గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో బి.ప్రత్తిపాడు జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న పార్సిల్ వ్యాన్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తొండంగి మండలం గోపాలపట్టణం గ్రామానికి చెందిన బెక్కం నాగేశ్వరరావు (50), అతడి తల్లి మంగాయమ్మను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మరణించాడు. తీవ్రంగా గాయపడిన అన్నవరం గ్రామానికి చెందిన ఎర్రమిల్లి అఖిలేష్, రాజు, భాగ్యలక్ష్మి విశాఖ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో, బొండు సత్యవతి పిఠాపురం ప్రభుత్వాసుపత్రి, శృంగవృక్షం గ్రామానికి చెందిన అమృతి చంద్రరావు కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రరావు అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఆటో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.



ప్రమాదంలో మరణించిన నాగేశ్వరరావు

పట్టిసీమకు వెళ్తుండగా..!

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

ఐదుగురికి స్వల్పగాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన తూము రమణతో పాటు మరో ఐదుగురు పట్టిసీమ బయలుదేరారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలోని గోదావరి ఏటిగట్టు రోడ్‌లో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమా దంలో తూము రమణ (40) గొంతులో ఇనుప ఊచ దిగిపోవడంతో తీవ్ర రక్త గాయమైంది. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ప్రభుత్వా సుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ భగవాన్‌దాస్ చెప్పారు.



బోల్తాపడిన ఆటో



మరణించిన రమణ (ఫైల్)

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పాదగయ క్షేత్రంలో నేడు రథోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు గురువారం ఉదయం 6గంటల నుంచి అభిషేకం, సాయంత్రం 4 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవవిగ్రహాల ఊరేగింపు, రథోత్సవం, రాత్రి 10 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

శివోహం...



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు





పిఠాపురం పాదగయలో అర్చకులు, జంగందేవర్లకు స్వయంపాకం అప్పగిస్తున్న భక్తులు



సామర్లకోట భీమేశ్వరాలయంలో పుష్కరిణి

హర హర మహాదేవ.. శంభోశంకరా..

అంటూ శివ నామస్మరణతో శైవక్షేత్రాలు

భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు



కరపలో రామలింగేశ్వరస్వామికి అభిషేకం



కొమరగిరిలో విశ్వేశ్వరస్వామి



పెద్దాపురం: కాండ్రకోటలో కోటేశ్వరస్వామి



పిఠాపురంలో బ్రహ్మకుమారీస్ ఏర్పాటుచేసిన పుష్ప శివలింగం

సామర్లకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా బుధవారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తుల క్యూలైన్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చీఫ్ ఫెస్టివల్ అధికారి తలాటం సూర్యనారాయణ, ఈవో నీలకంఠం పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. స్థానిక వాసవీ యూత్ సభ్యుల సౌజన్యంతో 15 వేల మంది భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. వేట్లపాలెం కొండపల్లి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు సుమారు 1500 మంది చిన్నారులకు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్, వాసవీ కపుల్స్ భీమేశ్వరా క్లబ్ ప్రతినిధులతో చిన్నారులకు 150 లీటర్ల పాలు, రొట్టెలు, పెద్దలకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. లయన్స్ భీమేశ్వరా క్లబ్, ఉప్పు వారి సత్రం వ్యవస్థాపక కుటుంబీకులు సంయుక్తంగా పాలు, రొట్టెలు, మజ్జిగ, అల్పాహారంలను పంపిణీ చేశారు. యెండ్రు సాయి వెంకటరమణ ఆవరణలో అల్పాహారం, అన్నదానం వితరణలు భక్తులకు నిర్వహించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో రెండు వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయంలో అధికారులు ఏర్పాటుచేసిన క్యూలైన్లు వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈ విషయంపై కూటమి నాయకులు సైతం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామికి ఫిర్యాదులు చేశారు.

పిఠాపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాదగయ సమీపంలోని జేజీఆర్ ఆసుపత్రి, పాతబస్టాండ్ వినాయక ఆలయం వద్ద, శిష్టికరణాల వీధి, సాయిబాబా గుడి, గోపాల్‌బాబా ఆశ్రమాల్లో జరిగిన అన్నదానాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. జేజీఆర్ ఆసుపత్రి వద్ద జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తులు భారీగా పాదగయకు తరలివరావడం, ఇతర ప్రాంతాల ట్రాఫిక్‌ను 216వ జాతీయరహదారి మీదుగా మళ్లించడంతో పిఠాపురం పట్టణం, బైపాస్‌రోడ్డు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంది. పిఠాపురం బైపాస్‌రోడ్డులో పాదగయ జంక్షన్ నుంచి ఇల్లింద్రాడ బైపాస్, అటు ఆర్వోబీల వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర అగచాట్లు పడ్డారు. పాతబస్టాండు వద్ద గల బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో పుష్పశివలింగం, వివిధ పుష్పాలతో ఏర్పాటు చేసిన చిన్న శివలింగాలు ఆకట్టుకున్నాయి.

కార్పొరేషన్(కాకినాడ): మహాశివరాత్రిని పురస్కరించుకుని నగరంలో ఆలయాలకు భక్తులంతా తెల్లవారుజాము నుంచే తరలివచ్చారు. దేవాలయంవీధిలోని పురాతన పెద్దశివాలయంలో భారీగా భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయంలో భీమేశ్వరస్వామి వారికి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో, రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు మోగంటి నాగభోగేశ్వరశర్మ, కామేష్, రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. భానుగుడి సెంటర్‌లో భానులింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి బంగారు చీరలో దర్శనమివ్వగా రామలింగేశ్వరస్వామి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. భానుగుడి రిజర్వు పోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సామూహిక పారాణయాలు నిర్వహించారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు పట్టణం, మండలంలోని చేబ్రోలు, దుర్గాడ శివాయాలకు మహాశివరాత్రి శోభ చేకూరింది. దర్శనాలకు భక్తులు బారులు తీరారు. దుర్గాడ శివాలయంలో ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

సర్పవరం జంక్షన్: సూర్యారావుపేటలో శ్రీశ్రీశ్రీ కాత్యాయని సమేత సహస్ర మహాలింగేశ్వరస్వామి, నేమాంలో శ్రీపర్వతి వర్ధిణీ శ్రీఉమారామలింగేశ్వరస్వామి, తిమ్మాపురంలో కాశీ విశ్వేశ్వరస్వామి, సర్పవరంలో శ్రీభవాని సమేత నీలకంఠేశ్వరస్వామి, తూరంగిలో తూరంగేశ్వరస్వామి, ఇంద్రపాలెంలో శ్రీగౌరీకేదేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రమణయ్యపేట శ్రీపీఠంలో నిర్వాహకులు స్వామి పరిపూర్ణానంద ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఎస్పీ ఆంజనేయనగర్‌కి చెందిన చిత్రకారుడు రామకుర్తి వెంకటేశ్వరరావు వేసిన శివుడు చిత్రం ఎంతగానో ఆకట్టుకుంది.

పెద్దాపురం: పట్టణ పరిధిలోని విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి ఆలయం, కట్టమూరులో రాజా రాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, కాండ్రకోట భువనేశ్వరీ సమేత కోటేశ్వరస్వామి, ఆర్‌బీ పట్నం చంద్రశేఖర స్వామి, జె.తిమ్మాపురంలో భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, జాగరణం చేశారు.

కరప: కరపలో పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, ఫణిరాజులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో కె.తిరుమలరవితేజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి అర్చకుడు కొంతేటి సూర్యదత్త శివకుమార్ లింగోద్భవ పూజలు చేశారు.

తాళ్లరేవు: పిల్లంక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాల్లో పురోహితులు ఏలూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తాళ్లరేవు, సుంకరపాలెం, పటవల, నీలపల్లి శివాలయాలుభక్తులతో కిటకిటలాడాయి.

కొత్తపల్లి: కొత్తపల్లిలో శ్రీబాలా త్రిపురసుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయం, ఉప్పాడలో శ్రీ చౌడేశ్వరిసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, కొమరగిరిలో విశ్వేశ్వరస్వామి ఆలయం,నాగులాపల్లిలో శివాయం, రమణక్కపేటలో శ్రీ విజయజనార్ధస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి రాజశేఖర స్వామి దేవాలయం ప్రాంగణంలో చిన్నారులు చేసిన కోలాట నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



సామర్లకోట భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సామర్లకోట భీమేశ్వరాలయం రోడ్డులో భక్తుల రద్దీ

పాదగయలో కలెక్టర్, ఐజీ, ఆర్‌జేసీ పూజలు



పాదగయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్



దర్శనానికి వస్తున్న ఆక్టోపస్ ఐజీ శ్రీకాంత్

పిఠాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఆక్టోపస్ ఐజీ శ్రీకాంత్, దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనరు సుబ్బారావు, ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. పాదగయలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొండేపూడి ప్రకాష్ పూజలు చేశారు. పాదగయలో దర్శనాలు జరుగుతున్న తీరు, భక్తుల ఏర్పాట్లుపై కలెక్టర్ పరిశీలనజరిపారు.

భీమేశ్వరాలయంలో...

సామర్లకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు.

మహాశివరాత్రి ఉత్సవాలు దేవదాయ శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 13 జిల్లాల్లో బుధవారం ప్రశాంతగా జరిగినట్టు దేవదాయ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు వెల్లడించారు. సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయంలో వివిధ సదుపాయాలపై సమీక్షించేందుకు ఆయన విచ్చేసి మాట్లాడుతూ ఆర్‌జేసీ కార్యాలయ పరిధిలో ప్రధానంగా 34 ప్రధాన శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

'ఎమ్మెల్సీ' పోలింగ్‌కు సర్వం సిద్ధం



గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరా

పెద్దాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గురువారం జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్డీవో కె.శ్రీరమణి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. సిబ్బందికి పోలింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఉదయం 8నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11మండలాలకు సంబంధించి 31పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. పెద్దాపురంలో పురుష ఓటర్లు 2398, మహిళా ఓటర్లు 1404 మొత్తం 3802మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని అసిస్టెంట్ కలెక్టర్ భావన పరిశీలించారు.



పెద్దాపురం: పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

16 పోలింగ్ కేంద్రాలు

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి26(ఆంధ్ర జ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాకినాడ రూరల్ మండలంలో 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 14,998 గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, ఇందులో కాకినాడ రూరల్ మండలంలో 10,472 ఓటర్లు, అర్బన్ పరిధిలో 2059 ఓటర్లు, కరప మండలంలో 2,467 ఓటర్లు ఉన్నారన్నారు. గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కాకినాడ రూరల్ మండలంలో 13 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ జరుగుతున్న తీరును అధికారులు పరిశీలిస్తారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తీసుకుని అధికారులు, సిబ్బంది చేరుకున్నారు.



పిఠాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు గోపాలకృష్ణ

పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి

పిఠాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాలకు ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి చేరింది. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలపరిషత్, మున్సిపల్, వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు 6పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ తదితరులు పరిశీలించారు.

గోపాలకృష్ణకు ఘన నివాళి

తాళ్లరేవు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నీలపల్లి పంచాయతీ సిద్ధార్థనగర్‌కు చెందిన కమిడి గోపాలకృష్ణ ఐపీఎస్ 30వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం గ్రామస్తులు నిర్వహించారు. ఐపీఎస్ చిత్రపటానికి చిన్నారులు నివాళులర్పించారు. కమిడి సత్యశ్రీనివాస్, మోకా మధుబాబు, గంటా గోపీలు చిన్నారులకు అంబేడ్కర్ జీవితచరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొనుగుమట్ల అశోక్‌కుమార్, మోకా రాహుల్, రేవు ప్రవీణ్, ఎం. నందగౌతమ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులను కలిసిన ఎంపీ సానా సతీష్



యనమల రామకృష్ణుడిని కలిసిన కాకినాడ రాజ్యసభ సభ్యులు సానా సతీష్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి26 (ఆంధ్ర జ్యోతి): ఎంపీ సానా సతీష్‌బాబు జిల్లాలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాలకు వెళ్లారు. కూటమి నేతలు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులంతా తప్పనిసరిగా పోలింగ్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన టీడీపీ సీనియర్ నేత యన మల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలను కలిశారు.

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు నమోదు

జీజీహెచ్(కాకినాడ), జనవరి 26(ఆంధ్ర జ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్-బారే సిండ్రోమ్(జీబీఎస్) కేసు నమోదైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి తెలిపారు. బుధవారం నమోదైన కేసుతో కలిపి మొత్తం నలుగురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన నీరసం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, కండరాల బలహీనత, జ్వరం, శ్వాసకోశ సమస్యలు, వాంతు లు, విరోచనాలు వంటి లక్షణాలు కనబడితే ఆందోళన చెందకుండా సంబంధిత న్యూరాలజీ వైద్యుడిని సంప్రదించాలన్నారు.

జనసేన ఇన్‌చార్జితో ఎంపీ సానా భేటీ



జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డిని కలిసిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): కుమారపురంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ బుధవారం కలిశారు. గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తదితర అంశాలపై వీరు చర్చించారు. ఎక్కువ శాతం ఓటింగ్ జరిగేలా కృషి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో కేకేఆర్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాజీ, కోచ్ మనోహర్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2025 పోటీలో కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు గోల్డ్ పతకాలు సాధించారు. ఈనెల 23న పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో షోటో కాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2025 పోటీలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌కు చెందిన సర్పవరం, జయేంద్రనగర్ బ్రాంచ్‌లకు చెందిన 6వ తరగతి వవిద్యార్థి పి.హేమశ్రీ, 7వ తరగతి విద్యార్థి ఏ జ్యోతి అమృత, సీహెచ్ హేమసాయితేజలు కమితే, కటా, వెపన్ కటా విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాజీ తెలిపారు. అలాగే 5వ తరగతి విద్యార్థి పి.సాయిసూర్య కటా, కుమితే, వెపన్ కటాల్లో గోల్డ్ మెడల్, ఎస్.ధనూష్ గగన్ కటా, వెపన్ విభాగాల్లో రెండో స్థానం సాధించాడన్నారు. 5,6వ తరగతి విద్యార్థులు కె.వినయ్, కె.నయిన్‌లు కుమితే, కటా, వెపన్ కటాల విభాగాల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. జాతీయస్థాయి స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్ మనోహర్‌ని స్కూల్స్ చైర్మన్ డాక్టర్ కె కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు. విద్యతో పాటూ క్రీడల్లో రాణించేలా కృషి చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ పరిసర ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని కాకినాడ వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కాకినాడ ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లు సులువుగా డబ్బులు సంపాదించాలని దొంగగా మారాడు. ఈనేపథ్యంలో పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈక్రమంలో అతడు గత జూన్ నుంచి ఇప్పటివరకు 14 నేరాలకు పాల్పడ్డాడు. కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావుకు వచ్చిన పక్కా సమాచారంతో తన బృం దంతో బుధవారం వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశారు. అతడి నుంచి 200 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పాదగయ ఆలయంలో వ్యక్తికి అస్వస్థత

పిఠాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ వచ్చే దారి లేక అస్వస్థతకు గురైన వ్యక్తిని స్ట్రెచర్‌పై ఉంచి తోసుకుంటూ ఆసుపత్రికి తీసుకెళ్లారు 108 సిబ్బంది. సకాలంలో వైద్యసేవలందడంతో ఆ వ్యక్తి కోలుకున్నాడు. విజయనగరానికి చెందిన పురోహితుడు కోసేరు గోపికృష్ణ మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పిఠాపురం పాదగయ క్షేత్రానికి వచ్చాడు. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి దర్శనానికి వెళ్లే సమయంలో అస్వస్థతకు గురయ్యాడు. ఎండతీవ్రత, అదే సమయంలో ఫిట్స్ రావడంతో సెమీ కాన్షియస్‌కు చేరుకున్నాడు. 108కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు 108 అంబులెన్స్ రావడానికి, తిరిగి ఎక్కించుకుని వెళ్లేందుకు భక్తుల రద్దీ కారణంగా అవకాశం లేకుండా పోయింది. పాదగయ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో అస్వస్థతకు గురైన వ్యక్తి వద్దకు అంబులెన్స్ వెళ్లే మార్గం లేక 108 అంబులెన్స్ పైలట్లు కృష్ణంరాజు, రాజాబాబు, ఈఎండీ టెక్నీషియన్లు మౌనిక, సునీతలు స్ట్రెచర్ తీసుకొచ్చి దానిపై గోపికృష్ణను ఉంచి భక్తుల మధ్య నుంచే అరకిలోమీటరుకు పైగా దూరంలో ఉన్న ప్రభుత్వాసుపత్రి వరకూ తోసుకుంటూ వెళ్లారు. అక్కడ వైద్యులు అతనికి చికిత్స అందించారు. 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించిన తీరును పలువురు అభినందించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులెవరూ అంబులెన్స్‌కు దారి ఇచ్చేందుకు, స్ట్రెచర్‌పై వ్యక్తిని పడుకోబెట్టి తోసుకువస్తున్న 108 సిబ్బందికి మార్గం క్లియర్ చేయడానికి ముందుకు రాకపోవడం విమర్శలకు గురయింది.

గంగా జలాలు పంపిణీ చేసిన సర్పంచ్

కొత్తపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రయాగలో జరుగుతున్న కుంభమేళాలో పాల్గొని అక్కడ త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించిన కొత్తపల్లి సర్పంచ్ గవర గంగాభవానీనాగేశ్వరరావు అక్కడ గంగా జలాలు గ్రామంలో పలువురికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 150ఏళ్లకు వచ్చే కుంభమేళాకు వెళ్లి త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించడం పూర్వజన్మ శుక్రుతమని తెలిపారు. అక్కడ నుంచి తీసుకువచ్చిన త్రివేణి సంగమంలోని పవిత్ర గంగాజలాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ సేవా నిరతిని గ్రామస్తులు, తదితరులు అభినందించారు.

8మంది ఓపీవోలు సస్పెండ్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 26(ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు హాజరు కాని 8మంది ఓపీవోలనుసస్పెండ్ చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం తెలిపారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూల్‌లో ముగ్గురు, పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో ఐదుగురు ఓపీవోలు పోలింగ్ మెటీరియల్ పంపిణీ విధులకు హాజరుకాలేదు. దీంతో ఓపీవోలు వెంకటేశ్వరశర్మ, కీర్తి నాగసూర్యపద్మావతి, కేఎస్‌వీఎస్ఎన్ మూర్తి, వి.అన్నపూర్ణ, కె.పుష్పమికీర్తి, పీఎన్‌కెవీవీఎస్ మూర్తిబాబు, కింతాడ నాగవెంకటగౌతమ్, బి.రామకృష్ణరాజులను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇద్దరు మైక్రో అబ్జర్వర్లు విధులకు హాజరు కానందున వారిపై చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

భీమేశ్వరస్వామి రథోత్సవంలో అనపర్తి ఎమ్మెల్యే

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 26(ఆంధ్ర జ్యోతి): పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీమాణిక్యాంబ సమేత శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి సందర్భంగా స్వామి రథోత్సవం నిర్వహిం చారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నలమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంప తులు, మల్లిడి జగ్గిరెడ్డి, రాధ దంపతులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

పాదగయ క్షేత్రంలో నేడు రథోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు గురువారం ఉదయం 6గంటల నుంచి అభిషేకం, సాయంత్రం 4 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవవిగ్రహాల ఊరేగింపు, రథోత్సవం, రాత్రి 10 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు


ఏలేశ్వరంలో మట్టితో చేసిన జ్ఞానయోగి, నందీశ్వరుల విగ్రహాలు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మార్మోగిన శివనామస్మరణ

● శివాలయాలకు పోటెత్తిన భక్తులు


వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ


దేవీపట్నంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకస్వామి

కూనవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, కూనవరంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. మర్రిగూడెం పంచాయతీ కొమరస్వామిగుట్ట జాతరలో అధికంగా గిరిజనులు పాల్గొన్నారు. ఐదేళ్ల తర్వాత ఈ జాతరకు గోదావరి దాటేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే నీళ్లు అంతగా లేకపోవడంతో భక్తులు గోదావరిలో నడుచుకుంటూనే ఆలయానికి చేరుకున్నారు. కూనవరం ఎస్ఐ లతాశ్రీ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు. భీమవరానికి చెందిన లెక్చరర్ నందికొండ వెంకన్న ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

దేవీపట్నం: దేవీపట్నంలోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంతో పాటు ఫజుల్లాబాద్, కమలంపాలెం, బియ్యంపల్లి-3 ఆర్అండ్ఆర్ కాలనీల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జనం గోదావరిలోకి దిగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. సుమారు పదివేల మంది భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మోతుగూడెం: పొల్లూరులో దుర్గా మల్లేశ్వరస్వామికి ఆలయప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్ స్వామిశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతిర్లింగార్చనను ఆలయ అర్చకులు, కమిటీసభ్యులు ఘనంగా నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సతీష్ రాఘవన్ శివరామకృష్ణ, వేపకాయల శ్రీను, గోవిందరాజు, రమేష్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివాలయం కొండపై రాజరాజేశ్వరీ సమేత ఉమారామలింగేశ్వర ఆలయంలో సర్పంచ్ గొల్లపూడి రమణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. జడ్డంగి శివారులోని భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో గల వాగులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, వైసీపీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. వంచంగి పంచాయతీ కుంతీదేవాక, అమ్మిరేకలు, లబ్బర్తి, తాళ్లపాలెం, వాతంగి గ్రామాల్లో కొలువైన పరమశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.


స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు


రాజవొమ్మంగి శివాలయంలో భక్తుల సందడి

రంపచోడవరం: శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజామునే పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రంప భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు జరిగే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వర్తక సంఘాలు, దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటరమణ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏడీఎంహెచ్వో జి.శిరీష, వైద్యాధికారులు శ్వేత, కెవిన్, సీహెచ్వో రామకృష్ణ, స్థానిక నాయకుడు అడబాల బాపిరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: గురమండ విశ్వనాథస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజామునే చన్నీటి స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. చవిటిదిబ్బలు పంచాయతీ పరిధిలోని పూతిగుంట ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయానికి కూడా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. జలపాతాల వద్ద భక్తులు స్నానాలు ఆచరించారు. అలాగే రంపలోని శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామిని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి-భాస్కర్ దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చకుడు ప్రసన్నకుమార్, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

ఎటపాక: బుట్టాయిగూడెం, గొల్లగూడెం, కన్నాయిగూడెంలోని శివాలయాల్లో స్వామివార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గన్నవరంలోని కాశీకార్తికేయ ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి, నాగలింగేశ్వర ఆలయాలు, పైడిపుట్ట శివాలయం, డి.భీమవరం రహదారిలో ఉన్న ఉబ్బలింగేశ్వర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వ్యాపారవేత్త అనంతపల్లి వికాస్-వర్షిని దంపతులతో పురోహితుడు సుబ్రహ్మణ్యం శర్మ జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.


రంప శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష దంపతులు


బుట్టాయిగూడెం శివాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

● రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు డివిజన్లలో మొత్తం 12 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందన్నారు. రెండు డివిజన్లలో పురుషులు 2,842, మహిళలు 1,827 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందుకు పీవోలు-15, ఏపీవోలు-15, ఓపీవోలు-30, మైక్రో అబ్జర్వర్లు-14, ఏడుగురు సెక్టార్ అధికారులను నియమించామన్నారు. పోలింగ్ అనంతరం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. తహశీల్దారు రామకృష్ణ, డీటీలు ఎన్వీవీ సత్యనారాయణ, శివ, సరిత, తేజస్విని, బాష, త్రిమూర్తులు, సుధాకర్‌రావు, జిలాని, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దారు, ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గురమండ కాశీవిశ్వనాథస్వామిని దర్శించుకున్నారు. ఆమె వెంట తహశీల్దారు వేణుగోపాల్, ఈవోపీఆర్డీ శివకుమార్, ఆర్ఐ శాంతకుమారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు వున్నారు.

శివాయ.. రుద్రాయ!

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు
● ఏలేరు నదిలో భక్తుల పుణ్యస్నానాలు
● ఆకట్టుకుంటున్న జ్ఞానయోగి, నందీశ్వరుల విగ్రహాలు


ఏలేశ్వరంలో ఏలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు లింగంపర్తి భోగేశ్వరస్వామి, సిరిపురం రామలింగేశ్వరస్వామి శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏలేరు నదీతీరాన బ్రాహ్మణ ఘాట్‌లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోడూరి మహేష్, యలమంచిలి శేఖర్, వెంకటేష్ తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టితో చేసిన జ్ఞానయోగి, నందీశ్వరుల ఆకారాలు అబ్బురపరిచేలా దర్శనమిచ్చాయి. కౌన్సిలర్‌లు బదిరెడ్డి గోవిందు, వెంకటరమణమ్మ కుటుంబ సభ్యులతో అన్నదానం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులతో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీ కాంతం, ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు, నేతృత్వంలో పోలీసు లు బందోమస్తు చేపట్టారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

రౌతులపూడి: మహాశివరాత్రిని పురస్కరించుకుని రౌతులపూడి, మేరక చామవరం శివాలయాలు కిటకిటలాడాయి. ఆయా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దారస్నానాలు చేసేందుకు పాదగయ, వేళంగి, గంగవరం తదితర గ్రామాలకు కుటుంబ సభ్యులతో వెళ్లారు.

గండేపల్లి: మండలంలోని ఆయా శైవక్షేత్రాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో మల్లేపల్లి పాతూరు కాలనీలో ఉన్న శివాలయం వద్ద నుంచి శివపార్వతులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఊరేగింపులో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గండేపల్లిలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామానికి చెందిన భక్తులు వెలమాటి కాశీవిశ్వేశ్వరరావు, మోహన సాయికుమారి దంపతులు పీటలపై కూర్చుని పూజలు జరిపారు.

జగ్గంపేట: ఇర్రిపాక మండలంలోగల శివకేశ్వర ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు, జ్యోతుల నవీన్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బావారం గ్రామం దగ్గర ఏలేరు ప్రాజెక్టు లోపల శివలింగం ప్రతిష్ఠించారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ మహాశివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పడాల చిట్టిబాబు, కంచి సురేష్, గంధం శ్రీనివాస్, కోరిమిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో కిటకిటలాడాయి. కోటనందూరులో భోగలింగేశర్వస్వామి, అల్లిపూడిలో తాండవరామలింగేశ్వరస్వామి, కెవోఅగ్రహారంలో విజ్ఞాశంకరస్వామి, బొద్దవరంలో గౌరీకాశీ జ్ఞానేశ్వరసామితో పాటు బీమవరపుకోట, బంగారయ్యపేటలోగల శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాధపురంలో శ్రీవీరాంజనేయస్వామితోపాటు కాకరాపల్లిలో అంజేనేయస్వామి ఆలయంలో పూజలు చేసారు.

కిర్లంపూడి: మండలంలోని పలు శివాలయాలు కిటకిటలాడాయి. పాలెం, భూపాలపట్నం, సోమవరం గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తామరాడ గ్రామంలో ఉన్న అష్టదళపద్మ శివలింగ దర్శనానికి భక్తులు పోటెత్తారు. తామరాడ గ్రామంలోఉన్న భవానీశంకర స్వామిగా ఉన్న అష్టదళ పద్మ శివలింగానికి గంధం బాబీ, తోట గోపాలకృష్ణ, గురువులు సత్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో మారేడు దళాలు, త్రివేణి సంగమం, ప్రయాగ, గంగానది, గోదావరి జలాలతో భక్తులతో స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఆధ్వర్యంలో శివాలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తామరాడ గ్రామంలో దాసాంజనేయస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి పురస్కరించుకుని సర్పంచ్ తోట అయ్యన్న, ఎంపీటీసీ గోకేడ రాజా, పెదిరెడ్డి లక్ష్మణరావు, కాయల మణికంఠ, సత్యంశెట్టి గణేష్, సుంకరరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు.

ఏవీ నగరంలో శివపార్వతుల కల్యాణం

తొండంగి : ఏవీ నగరంలో ఉన్న వేంకటేశ్వరుని ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. శ్రవణా నక్షత్రం కావడంతో ముందుగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని కల్యాణం నిర్వహించారు. అనంతరం అర్చకులు వెంకన్న, మిశ్రాలు శివపార్వతులు కల్యాణం జరిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివాలయంలో లింగోద్భవకాలంలో అభిషేకాలు నిర్వహించారు. తొండంగి రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరుని ఆలయం, బెండపూడి విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని ఆలయం, ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలోను అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించారు. ఎరకంపాలెం, దారపల్లి, తోటపల్లి కొండల్లో ఉన్న దారామల్లికార్జున స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ప్రదేశాల్లో ఉన్న జలపాతాల్లో భక్తులు స్నానాలు ఆచరించి దారా మల్లికార్జున ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి, ప్రత్తిపాడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ధర్మవరం రాజరాజేశ్వరి స్వామి ఆలయాల వద్ద శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో రమణ సేవాశ్రమ నిర్వాహకులు రమణానందస్వామి ఆధ్వర్యంలో రాత్రి బసవేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. భక్తులు బసవేశ్వర స్వామి అభిషేకాల్లో పాల్గొన్నారు.

ఉత్సవ మండపం ప్రారంభం

శంఖవరం: నెల్లిపూడిలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో జనసేన నేత ఏర్పాటు చేసి ఉత్సవ మండపాన్ని కుడా ఛైర్మన్ తుమ్మలబాబు ప్రారంభించారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఉత్సవ మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ తమ్మయ్యబాబు, బీజేపీ కన్వీనర్ సింగిల్‌దేవి, సత్తిరాజు, టి.అప్పా రావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని గవరపేట శివాలయంలో పాటు పలు శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. తిమ్మాపురం, తేటగుంట, తాండవ లింగేశ్వర ఆలయంతో పాటు తపోవన క్షేత్రంలో శివునికి ప్రత్యేక పూజలతో పాటుగా రుద్రాభిషేకం నిర్వహించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించారు. ఎరకంపాలెం, దారపల్లి, తోటపల్లి కొండల్లో ఉన్న దారామల్లికార్జున స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ప్రదేశాల్లో ఉన్న జలపాతాల్లో భక్తులు స్నానాలు ఆచరించి దారా మల్లికార్జున ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి, ప్రత్తిపాడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ధర్మవరం రాజరాజేశ్వరి స్వామి ఆలయాల వద్ద శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో రమణ సేవాశ్రమ నిర్వాహకులు రమణానందస్వామి ఆధ్వర్యంలో రాత్రి బసవేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు బసవేశ్వర స్వామి అభిషేకాల్లో పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్


శివ కేశవుల ఆలయం వద్ద ఎమ్మెల్యే దంపతులు


దారపల్లి జలపాతం వద్ద భక్తుల స్నానాలు

సత్యదేవుడి సన్నిధిలో ఘనంగా సరస్వతీపూజ



ప్రత్యేక వేదికపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లు, సరస్వతీదేవికి పూజలు చేస్తున్న పండితులు, విద్యార్థులకు పెన్నులు అందిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం సరస్వతీదేవి పూజ జరిగింది. ఉదయం 9గంటలకు నిత్యకల్యాణమండపంలో ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మరో వేదికపై సరస్వతీ దేవిని ఆశీనులు గావించారు. ఈవో సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పదవ తరగతి, ఇంటర్ తదితర పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో దీన్ని నిర్వహించారు. ముందుగాగణపతిపూజ, పుణ్యాహ వచనం అనంతరం చదువులతల్లి సరస్వతి స్తోత్రాన్ని విద్యార్థులతో పఠింపచేశారు. సత్యదేవుడి ఆశీస్సులతో కూడిన కలాలు, రక్షలను పూజల వద్ద ఉంచారు. అనంతరం వీటిని ఈవో సుబ్బారావు విద్యార్థినీ, విద్యార్థులకు అందించారు. ఆయా కార్యక్రమాలను ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు సత్యదేవుడి ప్రత్యేక దర్శనం, అన్నదాన భవనంలో ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు.

బఫే పద్ధతిలో అన్నప్రసాదం ప్రారంభం

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు అన్నప్రసాద హాలు సరిపడక అధిక సమయం వేచి ఉండడాన్ని గ్రహించిన జిల్లా కలెక్టర్ భక్తుల సౌకర్యంకోసం ప్రస్తుతం అమలుచేస్తున్న సిట్టింగ్‌తో పాటుగా బఫే విధానంలో అందించాలని ఆదేశించడంతో బుధవారం అన్నదాన హాలుపై అంతస్తులో బఫే విధానాన్ని బుధవారం ఈవో వీర్ల సుబ్బారావు ప్రారంభించారు. దీంతో భక్తులకు నిరీక్షణ తప్పినట్లయింది. కేవలం 10 నిమిషాల వ్యవధిలో సిట్టింగ్, బఫే అమలుచేయడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 3వేలమంది నిరీక్షణ లేకుండా అన్నప్రసాదం స్వీకరించారని అన్నదాన విభాగ అధికారులు తెలిపారు.

మూలవరులు, శంకరుడికి లక్షచామంతుల పూజ

మహాశివరాత్రిని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధిలో బుధవారం ప్రధానాలయంలోని మూలవిరాట్, శంకరుడికి లక్షచామంతుల పూజ నిర్వహించారు. గర్భాలయంలో మధ్యలో విష్ణుస్వరూపుడైన సత్యదేవుడు, కుడిపక్క అనంతలక్ష్మీ అమ్మవారు, ఎడమభాగంలో పరమశివుడు కొలువై యున్నందున విశేష పూజలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు చేపట్టారు. లక్ష చామంతులను దాత పచ్చిగోళ్ల రాజబాబు వితరణగా ఇవ్వడంతో పాటుగా నిర్ణీత రుసుము దేవస్థానానికి జమ చేశారు. ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

తాళ్లూరు గ్రామస్థులతో ట్రైనీ కలెక్టర్ చర్చలు

తుని రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా తాళ్లూరు గ్రామం వద్ద బ్రిడ్జి కోసం గ్రామస్తులు చేపడుతున్న ఆందోళనపై ట్రైనీ కలెక్టర్ భావన చర్చలు జరిపారు. తాళ్లూరుగ్రామంలో గ్రామస్తులతో మాట్లాడిన ఆమె తాళ్లూరు గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా పోలవరం కాలువపై పంట పొలాలను అనుసంధానం చేస్తూ బ్రిడ్జి ఏర్పాటుకు చొరవ చూపుతున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం కుమ్మరిలోవ కాలనీలో పర్యటించి భూములు, ఇల్లు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. తాళ్లూరులో మాజీ ఎంపీటీసీ ఆవుగడ్డ వెంకటరమణ, గ్రామపెద్దలు చర్చలు జరపగా, కుమ్మరిలోవ గ్రామంలో జక్కాన రామునాయుడు, పోతల రమణ రైతుల తరుపున కలెక్టర్‌తో మాట్లాడారు. ట్రైనీ కలెక్టర్ వెంట స్థానిక తహశీల్దార్ ప్రసాద్, ఆర్ఐ తాతారెడ్డి, వీఆర్వో, సర్వేయర్లు ఉన్నారు.


తాళ్లూరు గ్రామస్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వంసిద్ధం

రౌతులపూడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్టు ఎంపీడీవో శివరామకృష్ణయ్య తెలిపారు. తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

జగ్గంపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని మునిరెడ్డి నాగేశ్వరరావు కోరారు. పోలింగ్ కేంద్రానికి అడ్రస్ తెలియకపోయినా, వెళ్ళడానికి వాహనం లేకపోయినా 98485 67258, 99120 18194, 93460 29999 ఫోన్ ద్వారాతెలియజేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కిర్లంపూడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నేడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని కిర్లంపూడి తహశీల్దార్ చిరంజీవి అన్నారు. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రులంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

శంఖవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో పట్టభద్రుల ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల పీవోలు ఎస్. రమాదేవి, సీహెచ్ బాలకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహశీల్దార్ తాతారావు, ఎంపీడీవో శర్మ తదితరులతో పాటు సత్యనారాయణ, వీరేష్, ఎమ్‌వీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యనమలతో రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు భేటీ


యనమలను కలిసిన సతీష్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల

తుని రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుతో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ పోలింగ్ తదితర అంశాలపై వారు చర్చించారు.

ఇంటర్మీడియట్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం


ఇంటర్మీడియట్ స్టేట్ ర్యాంకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అఖిల్ జూనియర్ కాలేజీలో గత ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో స్టేట్ 2వ ర్యాంకు సాధించిన ఎల్.ఆదిలక్ష్మిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇనకోటి సునీత, ఛైర్మన్ ఇనకోటి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం టి.రాయవరం గ్రామానికి చెందిన బత్తుల చినపాప (52) జనవరి 11న ఇంటి వద్ద వేసుకున్న చలిమంటలో ప్రమాదవశాత్తూ గాయపడింది. ఆర్ఎంపీ వైద్యులతో చికిత్స చేయించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో తదనంతరం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో జాయిన్ చేశారు. ఆమెకు షుగర్ ఉండటంతో గాయాలు మానకపోవడంతో కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందారు. ఆమె కుమారుడు రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.